క్లుప్తంగా

ముడసర్లోవ డంపింగ్ యార్డు తొలగించాలని వినతి

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనక ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారిని ఏఐవైఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమెతో పాటు జోన్–2 కమిషనర్ కనక మహాలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రిజర్వాయర్‌లో డంపింగ్ యార్డు నుంచి వ్యర్థాలతో కూడిన నీరు, దానిపైన ఉన్న రామకృష్ణాపురం గ్రామస్తుల వాడుకనీరు కలుస్తుందని వినతి పత్రంలో వివరించారు. డంపింగ్ యార్డు కిందన రిజర్వాయర్ ఉండడంతో వర్షాకాలంలో వ్యర్థాలతో కూడిన నీరు కలిసిపోతుందని చెప్పారు. అలాగే ఎంవీపీ కాలనీలో నిర్వహిస్తున్న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకులు అనధికారిక వసూళ్లు చేస్తున్నారని, వారిని తప్పించి వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు, కొమరం సందీప్, కెల్ల రమణ, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలువ్యాపారాలు నిర్వహించుకోవడానికి శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి కొన్ని, ముడేళ్ల కాలపరిమితితో కొన్ని లీజు హక్కులు కల్పించారు. హెచ్చు మొత్తంలో పాడిన వారికి అధికారులు షాపులు ఖరారు చేశారు. సింహగిరిపై భక్తులకు ఫొటోలు తీసేందుకు ఏడాదికి రూ. 26.33 లక్షలు, కాఫీ,టీల విక్రయానికి రూ.42వేలకు ఖరారు చేశారు. సింహాచలం గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.96వేలు, గోపాలపట్నం బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు లక్షా 43వేలు, కేశ ఖండనశాల వద్ద షాపు అద్దె నెలకు రూ.38వేలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని 68వ దుకాణానికి నెలకు రూ. 37వేలు, కొండదిగువ పురూరవ బిల్డింగ్‌లోని 29, 32 దుకాణాలకు నెలకు రూ.12,500 చొప్పున, పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడో నెంబర్ షాపునకు నెలకు రూ.10,400, ప్రహ్లాదపురంలోని షాపు నెంబర్ 8 నెలకు రూ.3 వేల అద్దెకు ఖరారు చేశారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఈవోలు రమేష్, జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్ అప్పారావు, ఉద్యోగులు దొంతల రమణ తదితరులు వేలం పాటలు నిర్వహించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహన చోదకుడికి కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపిన వివరాలిలా.. ఇటీవల ఎన్ఏడీ బ్రిడ్జి వద్ద చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి గూడ్స్ వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకున్నారు. ఆ వ్యక్తికి మూడో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఇన్‌చార్జి 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వై.గణపతిరావు రూ.10 వేలు జరిమానా విధించారు. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు కేసులకు గాను మొత్తంగా రూ.31,000 జరిమానా వసూలు చేశారు.

బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెం బీచ్‌కు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. కొందరు స్థానికులు గుర్తించి ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఒడ్డున ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. అతని శరీరంపై ప్యాంట్ మాత్రమే ఉంది. వివరాలు కోసం వెతికినా లభించలేదు. దీంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

వివాదాస్పదమైన రహదారి నిర్మాణం



రోడ్డు పనుల కోసం వచ్చిన పొక్లెయిన్



కాలనీకి రోడ్డు నిర్మించాలని అధికారులను కోరుతున్న కాలనీ వాసులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు భానునగర్ కాలనీకి తలపెట్టిన రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. కృష్ణా కళాశాల మీదుగా హెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్డును కలుపుతూ భానునగర్ రహదారి ఉంది. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారులు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పూనుకున్నారు. అయితే ఇక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి వీలు లేదని, ఈ స్థలం తమది అంటూ కొందరూ జీవీఎంసీ అధికారులను అడ్డుకున్నారు. దీంతో స్థానిక నాయకుడు మొల్లి అప్పారావు, తదితరులు అక్కడి చేరుకున్నారు. కాలనీవాసుల అభ్యర్థన మేరకు రోడ్డు నిర్మాణం చేపడితే అడ్డుకోవడం సమంజసం కాదని వారించారు. ఇరువురు మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఎంవీపీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్డు నిర్మాణం చేపడితే అడ్డుకోవడం ఏంటని ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు ప్రశ్నించారు. ఈ స్థలం తమది అంటూ సదరు వ్యక్తులు పలు జెరాక్స్ కాపీలు చూపించారు. ఒరిజినల్ పత్రాలు చూపించాలని సీఐ సూచించారు. అయితే ఇప్పటికే ఈ స్థలాన్ని జీవీఎంసీ కమిషనర్ సందర్శించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. ఇరువర్గాల వాదనల నడుమ రోడ్డు నిర్మాణం వాయిదా పడింది. స్థలానికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు చూపించి రెవెన్యూ అధికారుల వద్ద నుంచి అనుమతి తెచ్చుకోవాలని స్థానిక నాయకుడు మొల్లి అప్పారావు సూచించారు.

'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాదవులకు గుర్తింపు'



యాదవ సంఘం సమావేశంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం: యాదవ సామాజిక వర్గానికి రాజకీయపరంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్తింపు లభించిందని, ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాసరావు అన్నారు. జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం శివాజీపాలెంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అందరూ సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ముచ్చల లక్ష్మి, అక్కరమాని రోహిణి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి



ఏఆర్ గ్రౌండ్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ : ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు క్రమశిక్షణ, శరీర దారుఢ్యం కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి పోలీసులు పరేడ్ నిర్వహించి ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ పోలీసులు ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలు, ఎక్కడైనా జరిగే నిరసనలు, ఆందోళనల వద్ద లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలసి సమన్వయంతో పని చేయాలన్నారు. వచ్చేనెలలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు సన్నద్ధం కావాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 19 మంది తమ అనారోగ్య సమస్యల గురించి ఆయనకు విన్నవించారు. ఆయా అర్జీలను వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు పాల్గొన్నారు.

ప్రొఫెషన్‌గా జర్నలిజం మారిపోయింది

- అస్సాం వర్సిటీ పూర్వ ప్రో వైస్ చాన్సలర్ నాగరాజ



స్మారకోపన్యాస ప్రసంగ సంచికను విడుదల చేస్తున్న ఆచార్య నాగరాజ తదితరులు

ఏయూక్యాంపస్: స్వాతంత్య్రానికి ముందు జర్నలిజం ఒక మిషన్‌గా సాగిందని, తదనంతరం అది ప్రొఫెషన్‌గా మారిపోయిందని అస్సాం కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్వ ప్రో వైస్‌చాన్సలర్ ఆచార్య కె.వి నాగరాజ అన్నారు. ఏయూ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఎస్.ఆర్.చందూర్ జగతి స్మారకోపన్యాసంలో 'ఇండియన్ జర్నలిజం పంక్చర్డ్ ప్రజెంట్, ఫ్రాక్చర్డ్ ఫ్యూచర్' అంశంపై ఆయన మాట్లాడారు. నేడు మీడియా ధనవంతుల చేతుల్లోనే ఉందన్నారు. వ్యాపారీకరణ, సంచనాలు ప్రచురించడం తొలుత అమెరికాలో ప్రారంభమై క్రమంగా ప్రపంచమంతా విస్తరించిందన్నారు. పాశ్చాత్య దేశాల్లో సంపాదకులుగా పనిచేసిన ప్రముఖులెందరో తొలుత రచయితలేనన్నారు. గతంలో పాత్రికేయ రంగంలో పనిచేసిన ఎం.చలపతిరావు వంటి వారు విలువలకు ప్రతిరూపంగా నిలుస్తారన్నారు. వృత్తి నిబద్ధత స్థానంలో నేడు ఆర్థిక అవసరాలు చేరిపోయాయన్నారు. గతంలో సంపాదకుడికి పూర్తి స్వేచ్ఛ, విశిష్ట అధికారాలు ఉండేవని.. నేడు వీరి పరిధి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. వార్తా కథనాల్లో సమాచారం లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా సమాచార వ్యవస్థను పూర్తిగా మార్చి వేసిందన్నారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ ఎస్.ఆర్ చందూర్ 200 పైగా రచనలు చేశారని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధికి మీడియా దోహదకారిగా నిలవాలన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార్య సి.ఎం.వినయ కుమార్, విభాగ ఆచార్యులు డి.వి.ఆర్ మూర్తి, చల్లా రామకృష్ణ, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మారకోపన్యాస ప్రసంగ సంచికను ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య నాగరాజును సత్కరించారు.

'మణిపూర్ మారణకాండ నిందితులకు ఉరిశిక్ష సరి'



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన యువతులు

ఎంవీపీ కాలనీ: మణిపూర్‌లో మారణకాండ నిందితులకు ఉరిశిక్ష సరైనదని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు సంఘం జిల్లా మహిళా కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం నిరసన ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు ప్రదర్శిస్తూ మరణించిన మహిళలకు నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ మణిపూర్ ఘటనతో యావత్ దేశం తలదించుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అమానవీయ ఘటనకు కారుకులైన వారికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అక్కడ అల్లర్లను నివారించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఘటనపై సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యదర్శి సత్యారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు దిప్పల సాంబమూర్తి, మహిళా అధ్యక్షురాలు గీత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శతక కట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మానసిక ఆస్పత్రి వద్ద మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ రామిరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని హరితమయంగా తీర్చిదిద్దుతూ, ఆహ్లాదాన్ని పంచేలా మొక్కలు నాటి సంరక్షించనున్నట్లు రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ పి.లోకేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ కె.మాధవీలత, డాక్టర్ టి.ఎస్.ఎన్.రాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్వస్థలానికి బంగ్లాదేశ్ మహిళ

ఏయూ క్యాంపస్: భారత్ పర్యటనకు వచ్చి కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయి, మానసిక కుంగుబాటుకు గురైన బంగ్లాదేశ్‌కు చెందిన మహిళకు పూర్తి స్థాయిలో నగరంలోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ మేరకు కోలుకున్న ఆమెను శనివారం స్వస్థలానికి పంపించడానికి ఏర్పాట్లు చేశారు. వివరాలిలా ఉన్నాయి. 2019 జూలైలో భారత్‌లోని ప్రార్థనా స్థలాలను సందర్శించడానికి వచ్చిన రహీమ అఖ్తర్ కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయింది. అదే సమయంలో ఆమె పాస్‌పోర్ట్ కూడా పోయింది. దీంతో మానసిక ఒత్తిడికి గురై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆమెను ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న రహీమ అఖ్తర్ తన స్వస్థలానికి వెళ్లి, కుటుంబ సభ్యులను కలుసుకోవడానికి సిద్ధమయ్యారు. ఇటీవల బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయం అధికారులు కూడా ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి వచ్చి సదరు మహిళ ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. చట్టపరంగా రావలసిన అనుమతులన్నీ లభించడంతో శనివారం సాయంత్రం 4 గంటలకు ఆమెను రైలులో కోల్‌కతాకు తీసుకెళ్లనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. బంగ్లాదేశ్ సరిహద్దు వద్దకు తీసుకువెళ్లి అక్కడి అధికారులకు ఆమెను అప్పగించనున్నారు. ఈ ప్రక్రియలో వాసవ్య మహిళా మండలి విశేష కృషి చేసింది.

వాటర్ ట్యాంక్‌పైకి జారిపడుతున్న మట్టి



సింహగిరి కాలనీ కొండపై వాటర్ ట్యాంక్‌పైకి జారిని బండరాళ్లు, మట్టి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం కొండవాలులో జీవీఎంసీ నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు రక్షణ గోడ లేదు. దీంతో కొండ పైనుంచి ట్యాంక్‌పైకి రాళ్లు, మట్టి జారిపోతోంది. ఇక్కడ హనుమంతవాక, సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, పెదగదిలి, చినగదిలి వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడవున కొండవాలు వాసులకు సింహగిరి కాలనీపైన గతంలో జీవీఎంసీ వాటర్ ట్యాంక్ నిర్మించింది. ఇటీవల దేవస్థానం కొండ అంచున ఆక్రమణలు జరగకుండా రక్షణ గోడ నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా ఈ ట్యాంక్‌ను ఆనుకొని గోడ నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. తవ్విన మట్టి, రాళ్లు కూడా ట్యాంక్‌పైకి జారిపోయింది. దీంతో ట్యాంక్ అంచులు శిథిలమయ్యాయి. కొద్ది రోజులకు ట్యాంక్ పూర్తిగా శిథిలమవుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మట్టి, బండరాళ్లు తొలగించి దాని చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వెరికోస్ వెయిన్స్‌పై అవగాహన అవసరం

బీచ్‌రోడ్డు: ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం మంది వృద్ధులను వేధిస్తున్న వెరికోస్ వెయిన్స్‌పై అవగాహన అవసరమని నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు సిబశంకర్ దలై ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళ్లలో వంకరలు తిరిగి ఉండే ఆకుపచ్చ సిరలు వల్ల వాపు, తీవ్రమైన కాళ్ల నొప్పులు వస్తాయని తెలిపారు. వైద్య రంగంలో ఈ సమస్యకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధిని నయం చేయొచ్చన్నారు.

నీటి నిల్వలతో దోమలు వృద్ధి



డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మద్దిలపాలెం : డెంగ్యూ, మలేరియా నుంచి రక్షణకు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సిబ్బంది సూచించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అమర్‌నగర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో దోమల వృద్ధిపై హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. వారం పైగా నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారతాయని సూచించారు. ప్రతి శుక్రవారం నిల్వ నీటి తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఏఎన్ఎం నిర్మలకుమారి, జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ శివకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 19వ వార్డు యువత



యువకులకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అక్కరమాని వెంకటరావు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెంకు చెందిన సుమారు 50 మంది యువత, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఎంవీపీ కాలనీలోని పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వారికి పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం విలువైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. చిత్తశుద్ధితో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో వాసుపల్లి దేవరాజు, బోగివల్లి మధు, బోగివల్లి ధనరాజ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు సూరాడ దాసు, వాడమదుల గణేష్, పేర్ల దుర్గారావు, పోలవరపు అప్పారావు, నక్క ప్రకాస్, వాసుపల్లి సిద్ధు, శంకర్, సూరాడ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో ఎంవీపీ కాలనీలో పార్కు అభివృద్ధి



పార్కుల నిర్వహణపై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఎంవీపీ కాలనీ: నగరంలోని జోన్–2, 3 పరిధిలో ఉన్న పార్కులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం పరిశీలించారు. ఆయా పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతో పాటు కొన్ని పార్కుల్లో అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి పలు సూచనలు చేశారు. పలు చోట్ల స్థానిక నివాసితులతో మాట్లాడి పార్కుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏనుగుల పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా నగరంలోని పార్కులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వయస్సుల వారికి ఉపయోగపడేలా పార్కుల్లో ప్లే గ్రౌండ్స్, జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానం ఎదురుగా ఉన్న పార్కును రూ.కోటితో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షణ ఇంజినీర్లు సత్యనారాయణరాజు, శ్యాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటా విక్రయాలు



సీతమ్మధార రైతుబజారులో రాయితీపై విక్రయిస్తున్న టమాటాలు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు కిలో టమాటా రాయితీపై రూ.50కే విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సీతమ్మధార రైతుబజారుకు 60 కేట్ల టమాటా సరఫరా కావడంతో వినియోగదారులు భారీగా చేరుకున్నారు. రెండు కౌంటర్లలో సబ్సిడీ టమాటా విక్రయించారు. రైతుబజారు ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

కూలిన గోడ : సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం ఉదయం రాయితీపై టమాటా విక్రయిస్తున్న సమయంలో ఒక్కసారిగా అక్కడి గోడ కూలిపోయింది. రైతులు, ఈవో, సహాయకులు వెంటనే స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వినియోగదారులు ఒక్కసారిగా గోడపై పడటంతో అది కూలింది.

అప్రమత్తతతోనే ఫ్లోరోసిస్ నివారణ

మహారాణిపేట: ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పారిశుధ్య శాఖ విడుదల చేసిన సమాచారం ద్వారా రాష్ట్రంలో ఫ్లోరోసిస్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించేందుకు తీర్చిదిద్దిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సమత, ఇతర వైద్యులు, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికైంది. చైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కార్యదర్శిగా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ శివప్రసాద్, సభ్యులుగా విద్యాశాఖ ఏడీ జ్యోతి, ప్రాజెక్టు అధికారి సమత తదితరులు ఎన్నికయ్యారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దొండపర్తి : సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించిన రోజునే మహిళా సాధికారత సాధ్యమని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేరీ సుజాత కంటిపూడి పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా 'మహిళా సాధికారత, శిశు సంరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించకుండా మహిళా సాధికారత సాధ్యపడదని చెప్పారు. ముఖ్యంగా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక శ్రేయస్సుకు మహిళల్లో శారీరక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ ప్రపుల్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

థర్మల్ ప్రోపర్టీస్‌పై వర్క్‌షాప్



ప్రేమ్‌చంద్ ఎస్.జైన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అడ్వాన్స్‌డ్ అనలిటికల్ లేబొరేటరీ ఆధ్వర్యంలో థర్మల్ ప్రోపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్ అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. హిటాచి హైటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ థర్మల్ అనాలసిస్ విభాగం జీఎం డాక్టర్ ప్రేమ్‌చంద్ ఎస్.జైన్ పాలిమర్స్, థర్మోసెట్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లిక్విడ్ క్రిస్టల్స్, నానో కాంపోజిట్స్, పీసీఎం తదితర అంశాలను వివరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ, ఎస్.రావు ఏఏఎల్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రీసెర్చ్ డీన్ ఆచార్య కె.బసవయ్య, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌చంద్ ఎస్.జైన్‌ని సత్కరించారు.

వర్క్‌షాప్‌లతో మెరుగైన జ్ఞానం సాధ్యం

ఏయూ క్యాంపస్: వర్క్‌షాప్‌ల నిర్వహణతో విద్యార్థుల్లో మెరుగైన జ్ఞానం పొందడం సాధ్యపడుతుందని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఏయూ అణు భౌతిక శాస్త్ర విభాగం, న్యూఢిల్లీకి చెందిన ఇంటర్ యూనివర్సిటీ ఏక్సలరేటర్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్ 'ఎక్ప్లెంటెన్స్ వర్క్ షాప్ ఆఫ్ రీసెర్చ్ విత్ ఏక్సలరేటెడ్ అయాన్ బీమ్స్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వృత్తి, పరిశోధన పరంగా విద్యార్థులకు అవసరమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. అనంతరం ఏయూ ఏసీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్ ప్రతాప్‌సింఘ్, శాస్త్రవేత్త సంజయ్‌కుమార్ కిడియాలు ప్రసంగించారు. సదస్సులో విభాగాధిపతి ఆచార్య పి.వి.లక్ష్మీనారాయణ, ఆచార్య ఎ.దుర్గా ప్రసాదరావు, డాక్టర్ పి.వి.మధుసూదనరావు, డాక్టర్ ఎస్.అప్పన్నబాబు, డాక్టర్ ఎన్.వి.సీతమహాలక్ష్మి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.